క్లుప్తంగా

ఆస్తమాపై అవగాహన



ఆస్తమాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని గెడ్డ గొర్లిపేట గ్రామంలో సైస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆస్తమా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆస్తమాపై అవగాహన కల్పించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ రవితేజ, ఫీల్డ్ కో–ఆర్డినేటర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



నవధ్యానాలను ప్రదర్శిస్తున్న వ్యవసాయ అధికారులు

రణస్థలం: నవధాన్యాల సాగుతో నేల సారవంతం అవుతుందని మండల వ్యవసాయ అధికారి డి.విజయభాస్కర్ అన్నారు. మండలంలోని వెల్పురాయి రైతుసేవా కేంద్రం పరిధిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో నేలను సారవంతం చేయడానికి నవధాన్యాల కిట్స్‌ను బుధవారం తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ఎకరాకు 25 రకాల నవధాన్యాల 12 కిలోల విత్తనాలను వేసుకొని, పెరిగిన తర్వాత కలియ దున్నడం వలన పంటకు కావాలసిన పోషకాలు సమృద్ధిగా నేలలో వృద్ధి చేయవచ్చునని చెప్పారు. రకరకాల విత్తనాలు వలన రకరకాల సూక్ష్మజీవులు వచ్చి చేరి మొక్కకు కావాల్సిన పోషకాలు అందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి మామిడి పాక సునీత, ఎస్ఎఫ్ ఏపిసీటీ శివకృష్ణ, ఎస్ఎఫ్ ఎంటీ కృష్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు అవసరమైన పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణారావు

జి.సిగడాం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు అవసరమైన పనులు చేపట్టాలని ఎంపీడీవో జి.రామకృష్ణారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధి పథకం ద్వారా గోశాలలు, నీటి తొట్టిలు, మొక్కల పెంపకం, ఇంకుడు గుంతలు తదితర పనులు చేపట్టాలన్నారు. ప్రతి ఒక్క అధికారి జిల్లా ఉన్నతాధికారులు ఇచ్చిన లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి వై.శారద, అనుషా, పశువైద్యాధికారి సమన్, ఏపీవో సీహెచ్ సత్యనారాయణ, ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 16న బహిరంగ వేలంపాట



జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పట్టణంలోని ఇల్లిసిపురం జంక్షన్ వద్ద నూతనంగా నిర్మించబడిన రైతు బజార్‌లో మూడు షాపులను ఒక సంవత్సరం పాటు అద్దెకు కేటాయించేందుకు ఈనెల 16వ తేదీన బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు సంయుక్త కలెక్టర్, రైతు బజార్ల చైర్మన్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న వ్యక్తులు 15వ తేదీ మధ్యాహ్నం 1 గంటలోపు పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసినవారికి మాత్రమే వేలంలో పాల్గొనడానికి అర్హత ఉంటుంది. మరిన్ని వివరాల కోసం 77025 45514, 91823 61328 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

అల్లూరికి నివాళి



అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని కుశాలపురం గ్రామంలో అక్షయ సేవా సంస్థ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని బుధవారం నిర్వహించింది. దీనిలో భాగంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇంజిన్లు ఇచ్చారు..
ట్రక్కులు మరిచారు..!

- నీరుగారిన స్వచ్ఛ పంచాయతీల లక్ష్యం
- ట్రక్కులు ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా ఇంజిన్లు
- అద్దె ట్రాక్టర్లతోనే పారిశుద్ధ్య నిర్వహణ



గెడ్డకంచరాంలో ఎమ్మెల్యే ఎన్ఈఆర్ ప్రారంభిస్తున్న ట్రాక్టర్ (ఫైల్)

జి.సిగడాం: గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి, చెత్త సంపద కేంద్రానికి తరలించి స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా రూపుదిద్దాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధిక జనాభా ఉన్న పంచాయతీలకు రూ.6 లక్షలు వెచ్చించి ట్రాక్టర్లు మంజూరు చేసింది. అయితే పారిశుద్ధ్య నిర్వహణకు వినియోగించేందుకు ట్రాక్టర్ ఇంజిన్లు ఇచ్చారు గానీ, చెత్తను తరలించేందుకు అవసరమైన ట్రక్కులు ఇవ్వడం మర్చిపోయారు. దీంతో రూ.లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన ఇంజిన్లు గ్రామ సచివాలయాల్లో మూలకుచేరి మూలుగుతున్నాయి.

జి.సిగడాంలో ఇదీ పరిస్థితి

మండలంలోని నిద్దాం, జి.సిగడాం, గెడ్డకంచరాం, బాతువ, ఆనందపురం గ్రామాలకు ఐదు నెలల క్రితం ట్రాక్టర్ల ఇంజిన్లు ఇచ్చారు. దీంతో వీటిని అధికారులు భద్రతగా మూలనపడేసి చేతులు దులుపుకున్నారు. దీంతో పంచాయతీల అభివృద్ధి, స్వచ్ఛ గ్రామాలకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ఆదిలోనే అవాంతరం ఏర్పడింది.

అద్దె ట్రాక్టర్లే దిక్కు

గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ప్రభుత్వం ట్రక్కులు ఇవ్వకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో చెత్త సేకరణకు పంచాయతీ నిధులు వెచ్చించి అద్దె ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు.



ఆనందపురంలో నిరుపయోగంగా ఉన్న ఇంజిన్



జి.సిగడాంలో మూలన పడి ఉన్న ట్రాక్టర్

ప్రస్తుతం పంచాయతీలకు కేటాయించిన ఇంజిన్లను ఉంచేందుకు సరైన సదుపాయం లేకపోవడంతో అవి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నాయి. ఇలాగే మరో ఆరు నెలలు ఉంటే తుప్పు పట్టుకుపోతాయని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాక్టర్ ట్రక్కులు మంజూరు చేస్తే పారిశుద్ధ్య నిర్వహణ సాధ్యమవుతుందని సర్పంచ్‌లు కోరుతున్నారు.

ట్రక్కు లేకపోవడంతో ఇబ్బంది



ప్రభుత్వం చెత్తను చెత్త సంపద కేంద్రానికి తరలించేందుకు ట్రాక్టర్‌ను మంజూరు చేసింది. కానీ చెత్తను తీసుకెళ్లడానికి ట్రక్కు ఇవ్వకపోవడంతో ఇంజిన్ నిరుపయోగంగా మారింది. అధికారులు స్పందించి తక్షణమే ట్రక్కు మంజూరు చేయాలి.

– చిత్తిరి మోహన్, సర్పంచ్, ఆనందపురం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ప్రభుత్వం నుంచి కేవలం ట్రాక్టర్ ఇంజిన్లు మాత్రమే వచ్చాయి. వాటిని అధిక జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు పంపిణీ చేయడం జరిగింది. ట్రక్కులు ఇంతవరకు రాలేదు. ట్రక్కులు వచ్చిన వెంటనే సంబంధిత పంచాయితీలకు పంపిణీ చేయడం జరుగుతుంది.

గుంటముక్కల రామకృష్ణారావు, ఎంపీడీవో, జి.సిగడాం

సకాలంలో పుస్తకాలు అందజేయాలి



ఎచ్చెర్ల క్యాంపస్: పుస్తకాలు పరిశీలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్ తదితరులు



రణస్థలం: స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్

రణస్థలం: మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ పాఠశాలలకు సకాలంలో చేరవేసి, విద్యార్థులకు అందజేయాలని విద్యాశాఖ ఆర్జేడీ కె.విజయభాస్కర్ సూచించారు. జేఆర్‌పురం ఉన్నత పాఠశాలలో భద్రపరిచిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్స్ స్టాక్ పాయింట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు మండలానికి 45,564 నోట్‌బుక్స్, 31,751 పాఠ్య పుస్తకాలు చేరాయన్నారు. మెరుగైన విద్యను విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వం అన్నివిధాలుగా చర్యలు తీసుకుంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, మండల విద్యాశాఖాధికారులు ఎ.త్రినాథరావు, లావణ్య, కో–ఆర్డినేటర్ విజయ్, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ పాఠశాలల పునః ప్రారంభం నాటికి విద్యార్థులకు చేరాలని ఆర్జేడీ కె.విజయభాస్కర్ సూచించారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భద్రపర్చిన స్టూడెంట్ కిట్స్ బుధవారం పరిశీలించారు. ఎచ్చెర్లలో 54,814 నోట్‌బుక్స్, 3,521 పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. ఆయనతో పాటు ఉపవిద్యాశాఖ అధికారి విజయకుమారి, మండల విద్యాశాఖ అధికారులు కె.పున్నయ్య, జి.రాజ్‌కిశోర్‌లు ఉన్నారు.

జైలులో పెట్టడం అన్యాయం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): డీజీపీ స్థాయి అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులను తప్పుడు కేసుల్లో ఇరికించి, జైల్లో పెట్టి బెయిల్ రాకుండా చేయడం అనైతికమని జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు అన్నారు. ఆయనను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ఉమారుద్ర కోటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన బ్రాహ్మణ కులంలో పుట్టడమే చేసిన నేరమా అని ప్రశ్నించారు. రౌడీయిజం, శాంతి భద్రతల పర్యవేక్షణ కోసం ఆయనను 5 జిల్లాలకు ఎస్పీగా గతంలో టీడీపీ ప్రభుత్వం నియమించిందని గుర్తు చేశారు. ఆంజనేయులపై పెట్టిన కేసులు తక్షణమే ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో గుమ్మా నగేష్, ఎం.ప్రసాదరావు, సీహెచ్ భాస్కరరావు, టి.కామేశ్వరి, టి.సునీల్‌శర్మ, జేఎం శ్రీనివాస్, ఎస్.నర్సింహమూర్తి, ఎం.భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

మూలకు చేరిన పునరావాస కేంద్రం..!



దివ్యాంగుల పునరావాస కేంద్రం

- పట్టించుకోని అధికారులు
- దివ్యాంగులకు అందని సేవలు

ఎచ్చెర్ల: దివ్యాంగులకు పునరావాసం కల్పించి, వారికి అవసరమైన పరికరాలను అందించడంతో పాటు ఫిజియోథెరపీ నిర్వహించడానికి చిలకపాలేంలో ఏర్పాటు చేసిన దివ్యాంగుల పునరావాస కేంద్రం నిరుపయోగంగా మారింది. కేంద్రం చుట్టూ తుప్పలతో నిండి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో దీనిని నిర్మించారు. ఇక్కడ మొదట్లో దివ్యాంగులకు అవసరమైన పరికాలను అందించేవారు. వారికి పునరావాసం కల్పించి నయమయ్యే వరకూ ఫిజియోథెరపీ చేసేవారు. అయితే గత కొన్నేళ్లుగా ఇక్కడి సేవలు తగ్గిపోయాయి. ఓ ప్రైవేటు వ్యక్తిని నియమించి నామమాత్రంగా ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాన్ని అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం వలన ఇప్పుడు కేంద్రం చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి. జాతీయ రహదారికి ఆనుకుని ఉండడం వలన అసాంఘిక కార్యకాలపాలకు నిలయంగా మారింది. అందువలన అధికారులు చొరవ తీసుకొని ఈ కార్యాలయాన్ని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధిలోకి తీసుకు రావాలి

దివ్యాంగులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే పునరావాస కేంద్రాన్ని మూలకు చేర్చారు. దీంతో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రాన్ని అభివృద్ధిలోకి తీసుకొచ్చి అవసరమైనవారిని ఆదుకోవాలి. వీటితో పాటు దివ్యాంగుల కాలనీల్లో ఉన్న సమస్యలను కూడా పరిష్కరించాలి

– సహదేవుడు, చిలకపాలేం, వికలాంగుల కాలనీ

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బలగలో వేంచేసిన గ్రామదేవత భద్రమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ఊరేగించి ముర్రాటలు సమర్పించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

22న హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ఈనెల 22వ తేదీన హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ పిలుపు మేరకు నగరంలో మధ్యాహ్నం శోభాయాత్ర నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు లోకనాథం ఆనందరావు తెలిపారు. ఈ మేరకు గుజరాతీపేటలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో హనుమాన్ శోభాయాత్ర కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. భజరంగదళ్ జిల్లా అధ్యక్షుడు కొయ్యాన కిరణ్ మాట్లాడుతూ నగరంలో శోభాయాత్ర భారీ బైక్ ర్యాలీ జరుగుతుందన్నారు. హిందూ బంధువులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ చాలక్ పి.వి.రమణమూర్తి మాట్లాడుతూ ఈ శోభాయాత్రలో ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసి భజన బృందాలతో, కోలాటాలతో వైభవంగా ర్యాలీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీరంగం మధుసూదన్‌రావు, ప్రాంత భజరంగదళ సంయోజక్ రావాడ రాజశేఖర్, నగర సంయోజక్ బొడిగి మధు, జిల్లా గోరక్ష ప్రముఖ్ మెట్ట శ్రీనివాస్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బోర గోపి, భజరంగదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల సాహిత్యం పుస్తకాలు చదవాలి

ఎచ్చెర్ల: ప్రతీ విద్యార్థి బాల సాహిత్యం పుస్తకాలను చదవాలని లావేరు శాఖా గ్రంథాలయం అధికారి మురపాక శ్రీనివాసరావు సూచించారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా లావేరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో బుధవారం పుస్తక పఠనం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ నాయకుల జీవిత చరిత్రలతో పాటు పలు కథలు కూడా చదవాలని సూచించారు. కార్యక్రమంలో సహాయకులు టి.వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక భేటీ





మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఉమామహేశ్వరరావు, పొన్నాడ రుషి

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు పొన్నాడ రుషి, ఇటీవల వైఎస్సార్‌సీపీ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బుక్కూరు ఉమామహేశ్వరరావులు బుధవారం మర్యాదపూర్వకంగా తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలియజేశారు. కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని తెలియజేశారు. – శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)

కల్యాణోత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణ చేపడుతున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో ఫాజుల్‌బాగ్ పేటలోని నారాయణ తిరుమలలో వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ధ్వజారోహణతో బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ సంకల్పం, మంటపారాధనలు చేసి సాయంత్రం స్వామివారి వాహనమైన గరుడ జెండాను ధ్వజస్తంభం వద్ద ఉంచి, ధ్వజారోహణ కార్యక్రమం చేసి కల్యాణ ఉత్సవాలు ప్రారంభించారు. గురువారం స్వామివారి కల్యాణ వేడుకలు జరుగుతాయని ఆలయ ఈవో పి.శ్యామలరావు తెలిపారు.

వైభవంగా కొట్నం మహోత్సవం



కొట్నం దంపు జరుగుతున్న దృశ్యం

గార: కూర్మావతార శ్రీకూర్మనాథుని కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం సాయంత్రం వేళ ఆలయంలో వైభవంగా కొట్నం మహోత్సవం నిర్వహించారు. ఏడాదికోసారి జరిగే తిరుక్కల్యాణం ముందురోజున ఈ కొట్నం దంపు ముత్తైదువులతో శాస్త్రోక్తంగా అర్చకులు చేపడతారు. ఉదయం మూలవిరాట్‌కు విశేష అర్చనలు, హోమాలను ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు ఆధ్వర్యంలో జరిగాయి. సాయంత్రం వేళ ఆస్థాన మంటపంలో స్వామి ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వాములను వేంచింపచేసి, రాజావారి గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. విశ్వక్సేన పూజ, పరిషత్ వంటి వైదిక క్రియలు జరిగాయి. అనంతరం కొట్నం దంపు కోసం వినియోగించే కఱ్ఱ రోలుకు ప్రత్యేక పూజలు చేసి, ధాన్యంతో పాటు సుగంధ ద్రవ్య మర్దన జరిపారు. కొట్నం దంపులో ధాన్యాన్ని దంచగా వచ్చిన బియ్యంతో ప్రసాదాన్ని తయారు చేసి స్వామికి కల్యాణం రోజున నివేదన చేస్తారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.నరసింహనాయుడు, దాసుబాబు, స్థానాచార్యులు శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సిరిమాను ఉత్సవాలు ప్రారంభం



దుర్గమ్మకు ఉపవాసం చెబుతున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకళంలో సిరిమాను ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. దండివారి ఇంటి నుంచి బయల్దేరి దుర్గమ్మ అమ్మవారి ఆలయానికి పాతశ్రీకాకళం ప్రజలు, సిరిమాను కమిటీ సభ్యులు డప్పులతో వెళ్లి దుర్గమ్మకు ఉపవాసం చెప్పడంతో పాటుగా ఎనుబోతుకు కూడా పూజలు నిర్వహించడం జరిగింది. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు దుర్గమ్మ అమ్మవారి దేవర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీపీ దేవ్, డాక్టర్ శివప్రసాద్, ఎల్.రామలింగస్వామి, మావూరు శేఖర్, నక్క శంకరరావు, కల్లెపల్లి సోంబాబు, దండి రాజేంద్రదేవ్, దండి శ్రీనివాస్, కఱ్ఱి రంగాజీ దేవ్, దేశెల్ల గోవింద మల్లిబాబు, గుత్తు చిన్నారావు, ముప్పన శ్రీనివాసరావు, గుంటముక్కల పాపారావు, మింద్రాన రమేష్, అదపాక రాంబాబు, కోల వేణుగోపాలదేవ్, దాసరి తిరుమలరావు, సన్యాసి, సాధు గణేష్, గింజి తాతారావు, సాధు గణేష్, అశ్వినీకుమార్, నక్క రవికుమార్, కునుకు కోటేశ్వరరరావు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం



వైఎస్సార్‌సీపీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- సూపర్ సిక్స్ పేరుతో జనాల చెవిలో పువ్వులు పెట్టారు
- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని దవళపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో కూటమి నాయకులు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ప్రజల చెవిలో పువ్వులు పెట్టారని ఎద్దేవా చేశారు. 11 నెలల కాలంలో సంక్షేమ పథకాలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎంతోమంది కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నా అందజేయకుండా అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికొదిలేసి కక్ష సాధింపులపైనే దృష్టిపెట్టారని మండిపడ్డారు. నిరుద్యోగ యువతకు భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సైనికుల్లా పోరాడాలి

గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు ప్రజల తరుపున సైనికుల్లా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక విధానాలు చేపడుతున్న కూటమి ప్రభుత్వాన్ని ఎండగట్టాలన్నారు. అధికారంలోకి వస్తే కార్యకర్తలకు మొదటి ప్రాధాన్యమిస్తామని తెలియజేశారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అనునిత్యం అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో జి.సిగడాం, రణస్థలం మండల పార్టీ అధ్యక్షులు డోల వెంకటరమణ, గొర్లె శ్రీనివాసరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి పిల్లల శివకుమార్, జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి, నియోజకవర్గం ఐటీ వింగ్ అధ్యక్షుడు చిత్తిరి మోహన్, సర్పంచ్‌లు వడిశ మహేశ్వరరావు, బుడారి లక్ష్మణరావు, పేడాడ శ్రీనివాసరావు, మాజీ డైరెక్టర్ పేడాడ శ్యామలరావు, పేడాడ నారాయణరావు, టంకాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.